# కులగణన మా ప్రభుత్వం బాధ్యత

## అందరికీ సమాన అవకాశాలే లక్ష్యం: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 5:** ఎన్నికల సందర్భంగా దేశ ప్రజలకు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక,ఆర్థిక,రాజకీయ,విద్య,ఉద్యోగ కులగణన సర్వే అధికారికంగా నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలని,సామాజిక బాధ్యత ఉండాలని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. పౌర సమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్‌గాంధీ ఇక్కడకు రావడం గొప్ప విషయమని, సామాజిక బాధ్యత,సమాన అవకాశాలు ఇవ్వాలన్న ఆలోచనతో రాహుల్ ఇక్కడకు వచ్చారని పేర్కొన్నారు. మాటలు కాదు, చేతలతో చూపాలన్నది రాహుల్ గాంధీ ఆలోచన అని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయ ఒడిదొడుకులను ఎదుర్కొని రాహుల్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలంటే చిత్తశుద్ధి ఉండాలని, రాహుల్ మాటను నెరవేర్చడే మన కర్తవ్యమన్నారు. ఉత్తర్‌ప్రదేశ్,కేరళ,మహారాష్ట్రలో ఎన్నికలు వున్నా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అభినందించడానికి రాహుల్ వచ్చారన్నారు. తాను ఓసీగా కొందరు ప్రశ్నించినప్పటికీ, మా నేత రాహుల్ ఇచ్చిన మాటను నిలబెట్టడం ముఖ్యం అన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్1 పరీక్షలో 31,383 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని, ఇందులో ఓసీలు 3076(9.8శాతం), ఈడబ్ల్యుఎస్- 2,774 (8.8శాతం),బీసీలు 17,921(57.11శాతం), ఎస్సీలు-4,828(15.3శాతం), ఎస్టీలు 2,783 (8.8శాతం) ఎంపిక అయ్యారని అని ఆయన తెలిపారు. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. మనది రైజింగ్ తెలంగాణ అని ఆయన పేర్కొన్నారు. భారత్ జోడో యాత్రలో దేశానికి రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడం మన కర్తవ్యమన్నారు. ఇందిరాగాంధీ గరీబ్ హఠావో అనే నినాదంతో చరిత్రలో నిలిచారని సీఎం గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో కులగణన చారిత్రక కార్యక్రమం అన్నారు. కులగణన చేసి తెలంగాణలో దేశంలో ఆదర్శ రాష్ట్రంగా నిలవబోతోందన్నారు. కులగణన పూర్తి చేసి బీసీలకు న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్లు అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కులగణను 2025 కేంద్ర ప్రభుత్వం జనగణనలో పరిగణనలోకి తీసుకోవాలని ఈ వేదికగా తీర్మానం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని లోక్‌సభలో రాహుల్ ప్రస్తావించాలని, కేంద్రం చేపట్టే జనగణనలో కులగణన ఉండేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

## సిఎం రేవంత్‌ను కలిసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 5:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రభుత్వం తాజాగా ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిషన్‌కు చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వర రావు, మెంబర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి, బీసీ గురుకులాల సెక్రటరీ సైదులును నియమించింది. మంగళవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు సంబంధించి చర్చలు జరిపినట్లు సామాచారం. స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లపై లోతైన సమకాలీన అధ్యయనం చేయాలని,నెల రోజుల్లో సమగ్ర నివేదికను అందించాలని కమిషన్‌కు తాజాగా కాంగ్రెస్ సర్కార్ స్పష్టం చేసిన విషయం విధితమే. కాగా, డిసెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

## తమిళనాడు, కర్ణాటక కంటే మెరుగ్గా తెలంగాణలో కులగణన

### నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కులగణ చేయడానికి తమిళనాడు కర్ణాటకలో క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి అధ్యయనం చేశామని తెలంగాణలో అంతకంటే మెరుగ్గా కులగణచేయబోతున్నామని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన బోయినిపల్లి గాంధీఐడియాలోజి సెంటరల్లో మాట్లాడుతూ రాష్ట్రంలో కుల ఘనన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధి తో పని చేస్తుందని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ తెలంగాణ లో పర్యటించిన సందర్భంలోను ఎన్నికల సమయంలోను కులగణన చేపడుతామని హామీ ఇచ్చారు అని గుర్తుచేశారు.ఆ హామీ నెరవేర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, కుల గణన చేస్తామని మ్యానిఫెస్టోలో చెప్పాం ఇచ్చిన మాట ప్రకారం కుల గణన చేస్తున్నాంకుల గణన కోసం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఫీల్డ్ స్టడీ చేశాంలోకల్ బాడీ ఎన్నికల్లో జనాభా లెక్కల ప్రకారం బీసీల రిజర్వేషన్ పెంచుతున్నాం.బిసి రిజర్వేషన్లు కోసం కోర్ట్ డెడికేటెడ్ బీసీ కమిషన్ వేయాలని సూచిస్తే వెంటనే వేశామని,ప్రభుత్వానికి బిసిల అభ్యున్నతి, సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉందన్నారు.

## విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్లపై ముగిసిన విచారణ

### ప్రభుత్వానికి 100 పేజీల విచారణ నివేదిక

### గత నెల 29తో ముగిసిన కమిషన్ కాలపరిమితి

### సొంత విభాగాలకు కార్యాలయ సిబ్బంది రిపోర్టు

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చత్తీస్‌ఘడ్‌తో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణ పనులకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విచారణ సంఘం తన విచారణను పూర్తి చేసింది. దీనికి సంబంధించి జస్టిస్ మదన్ బీ లోకూర్ విచారణ సంఘం మొత్తం 100 పేజీలతో కూడిన విచారణ నివేదికను రూపొందించింది. ఈ విచారణ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ప్రత్యేకించి ఈ నివేదికను రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు అందచేసింది. ఇదే సమయంలో విచారణలో భాగంగా వివిధ విభాగాల నుండి స్వాధీనం చేసుకున్న దస్త్రాలను తిరిగి వాటికి పంపించి వేస్తున్నారు. మరోపక్క బూర్గుల రామకృష్ణారావు భవనంలో తమకు కేటాయించిన కార్యాలయంలో ఇప్పటి వరకూ విచారణ సంఘం కార్యకలాపాలను నిర్వహించగా, ఆ కార్యాలయాన్ని ఇప్పుడు ఖాళీ చేస్తోంది. అంతేకాకుండా కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బందిని వారి వారి సొంత విభాగాల్లో రిపోర్టు చేయాలని విద్యుత్ విచారణ కమిషన్ ఆదేశించింది. కాగా చత్తీస్‌ఘడ్‌తో చేసుకున్న విద్యుతన సరఫరా ఒప్పందాలతో పాటు, తెలంగాణలోని యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అక్రమాలు, లోటు పాట్లపై మాజీ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి, హైకోర్టు జోక్యంతో రెండు నెలల క్రితం కొత్తగా నియమితులైన చీఫ్ జస్టిస్ మదన్ భీమ్‌రావు లోకూర్ విచారణ చేశారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్ల పరిశీలన పూర్తి చేశారు. అలాగే అనేక మంది అధికారులకు, ప్రజా ప్రతినిధులకు నోటీసులు పంపడంతో పాటు, వారిని విచారించారు. వీరితో పాటు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ సంస్థల నిర్మాణం, చత్తీస్‌ఘడ్ విద్యుత్ కొనుగోళ్ల అంశంపై గతంలో విద్యుత్ సంస్థల్లో పని చేసిన మాజీ అధికారులను విచారించారు. ఇందులో భాగంగా మాజీ ఇంధన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులుగా పనిచేసిన సురేశ్ చందా, అరవింద్ ఖుమార్, ఎస్కే జోషి, అజయ్ మిశ్రాలతో పాటు, మాజీ ట్రాన్కో, జెన్కో సిఎండి దేవుపల్లి ప్రభాకర్‌రావును విచారించి, వారి నుండి వివిధ అంశాలపై వివరాలను సేకరించారు. వీరితో పాటు, ప్రొఫెసర్ కోదండరాం, విద్యుత్ ఉద్యోగి రఘు తదితరులు విచారణకు హాజరై తమ వద్ద ఉన్న సమాచారాన్ని కమిషన్‌కు అందచేశారు. ఈ కమిషన్ విచారణలో భాగంగా మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు నోటీసులు జారీ చేసింది. వీటిని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్ చెల్లదంటూ హైకోర్టు కొట్టేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ చంద్రశేఖర్‌రావు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అక్కడ విచారణ చేసిన ధర్మాసనం విద్యుత్ విచారణ కమిషన్ ఛైర్మను మార్చాలని ఆదేశించింది. దీంతో కొత్తగా జస్టిస్ మదన్ భీమ్‌రావు లోకూర్‌ను నియమించింది. ఈ కమిషన్ పదవీకాలం గత నెల 29వ తేదీతో ముగిసింది. ఇదే సమయంలో కమిషన్ తన విచారణను కూడా ముగించింది.

## కెసిఆర్ కృషి వల్లే తెలంగాణలో పెరిగిన భూముల ధరలు

### తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో: కెటిఆర్ వెల్లడి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి , హైదరాబాద్, నవంబరు 5:** కెసిఆర్ కృషి వల్లే తెలంగాణలో భూముల ధరలు పెరిగాపోయాయని, ఉమ్మడి ఏపీలో రైతులకు మేలు చేయాలని పాలకులు ఆలోచించలేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన తాతకు 400ఎకరాల ఆస్తి ఉండేదని, అయితే అన్ని ఎకరాలు ఉన్నప్పటికీ నీళ్ల లేకపోవడంతో అవి నిరుపయోగంగా,విలువ లేకుండా ఉండేవన్నారు. మంగళవారం నగరం లోని శ్రీనగర్ కాలనీలో తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఎంత పెద్ద భూస్వామి అయినప్పటికీ భూమికి విలువ లేకపోవటంతో బంగారం కుదవ పెట్టాల్సి న పరిస్థితి ఉండేదన్నారు. కేసీఆర్ ఇవ్వన్నీ దగ్గరుండి గమనించారని, నీళ్ల లేకపోవటంతోనే భూములకు విలువ లేదని గ్రహించారని, కేసీఆర్ 10 ఏళ్ల పాలన తర్వాత ఇప్పుడు తెలంగాణలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లిన సరే ఎకరానికి రూ. 15 లక్షలు అయ్యిందన్నారు. ప్రతి ఒక్కరి జీవితం భూమి చుట్టూ తిరుగుతోందని, భూమి విలువ చాలా ఎక్కువ గా ఉంటుంది. కనుకే దానికోసం ఎన్నో పంచాయితీలు జరుగుతాయన్నారు. టీఆర్ఎస్ పార్టీకి మొదట్లో రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతంలో పట్టు దొరకలేదు. ఎందుకంటే తెలంగాణ ఏర్పడితే భూముల ధరలు తగ్గుతాయని చాలా ప్రచారం చేశారు. తెలంగాణ ఏర్పడితే భూముల విలువ పెరుగుతదంటే ఎవరు నమ్మలేదు. తెలంగాణ ఏర్పడిన వెంటనే కేసీఆర్ పొట్టి కూటి కోసం వచ్చిన వాళ్లతో మాకు పంచాయితీ లేదన్నారు. అభివృద్ధే మా మతం, సంక్షేమమే మా కులం అంటూ కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. గతంలో బంగారం గానీ బ్యాంకుల్లో గానీ డిపాజిట్ చేసేవారు కానీ గత 20 ఏళ్లుగా మాత్రం మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి వాళ్ల భూమి మీద పెట్టుబడి పెట్టారు. అలాంటిది తెలంగాణ ఏర్పడితే తెలంగాణలో భూముల ధరలు ఢమాల్ అంటాయంటూ అనుమానంతో వాళ్లు ఉండేవారు. అందుకే తెలంగాణ ఏర్పాటుకు వాళ్లు భయపడ్డారని చెప్పారు. భూమి విలువ పెరిగితే భూమి ఉన్న యాజమానికి ఎంతో భరోసా ఉంటుంది. సాగు నీళ్ల వచ్చి, 24 గంటల కరెంట్ వచ్చి ప్రతి రైతుకు కెసిఆర్ ఎంతో భరోసా ఇచ్చారని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం రాకముందు వారానికి రెండు రోజులు పవర్ హాలిడేస్ ఉండేదన్నారు. రైతులు అర్ధరాత్రి వెళ్లి పొలానికి నీళ్ల పెట్టుకోవాల్సి న పరిస్థితి ఉండేది. కానీ కేసీఆర్ మొత్తం పరిస్థితిని మార్చేశారు. నీళ్ల, కరెంట్ సమస్యను తీర్చేశారని, సమగ్ర, సమీకృత అభివృద్ధిని చేశారని తెలిపారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మంచిగా చేసిన కరెంట్ ను కూడా నాశనం చేశారని, ఏ రైతును కదలించిన బాధపడుతున్నారు. మేము కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని చెబుతున్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు అయ్యింది. ఇప్పటి వరకు రియల్ ఎస్టేట్ కు సంబంధించి ఒక్క మంచి నిర్ణయం తీసుకోలేదన్నారు. హైడ్రా అనే పేరుతో ఆలోచన లేకుండా చేస్తున్నారు. కేవలం బ్లాక్ మెయిల్ దందా కోసం దాన్ని పెట్టారని పేర్కొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఉన్న ప్రాజెక్ట్ లు రద్దు చేస్తున్నాడు, కొత్త ప్రాజెక్టులు లేవు, బిల్డర్లను బెదిరించి డబ్బులు కావాలని అంటున్నాడు. ఎందుకంటే ఆయన ఢిల్లీకి పంపించాలి. మార్కెట్ లో ఎవరికీ డబ్బులు లేని పరిస్థితిని తీసుకొచ్చారు. నేను చెప్పేవన్నీ నిజాలు అని రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. మా మీద కోపంతో వేల మంది కడుపులు కొట్టొద్దు. మంచిపనులు చేయండి. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో నో ఎల్ఆర్ఎస్, నో బీఆర్ఎస్ అని అన్నారు. కానీ ఇప్పుడు ముక్కు పిండి మరీ ఎల్ఆర్ఎస్ వసూలు చేస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. ఇది మధ్యతరగతి ప్రజలకు ఎంతో నష్టం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక చేయి ఏం చేస్తుందో మరో చేయికి తెలియదని, అందుకే రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తెలుసుకోవాలన్నారు. మళ్లీ ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీఆర్ఎస్ గెలవటం ఖాయమని రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. మేము అధికారంలో ఉన్నప్పుడు ప్రతీకార చర్యలంటూ పిచ్చి పిచ్చి ఆలోచనలు చేయలేదు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేయాలని భావించాం. ప్రభుత్వం తన ఆలోచనను మార్చుకొని ప్రజలకు మంచి చేస్తే నిర్మాణాత్మక ప్రతిపక్షంగా సహకరిస్తామన్నారు.



## రాహుల్‌కు సిఎం, మంత్రుల ఘనస్వాగతం

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** కులగణన సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన లోక్‌సభ ప్రతిపక్షనేత ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి బేగంపేట విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదరరాజనర్సింహా ఇతర మంత్రులు ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి కండువాలతో సత్కరించారు. బోయిన్ పల్లిలోని గాంధీయన్ ఐడియాలజీ సెంటర్ లో జరిగిన కులగణన సంప్రదింపుల సమావేశానికి సీఎం, కాంగ్రెస్ ఇంచార్జీ దీపాదాస్ మున్షితో కలిసి హాజరైనారు. కులగణపై సంప్రదింపుల కార్యక్రమంలో సామాజిక రాజకీయ కులసంఘాల నాయకులతో ఆయన ఇంటారాక్ట్ అయ్యారు. అనంతరం తిరిగి ఢిల్లీకి వెళ్లారు.

## 6 గ్యారెంటీలు 400 హామీలు ఏమయ్యాయో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీ అప్ డేట్ కోసం యావత్ తెలంగాణ ఆసక్తితో ఎదురు చూస్తున్నదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీలు 400 హామీలు ఏమయ్యాయో రాహుల్ గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ట్విట్టర్ వేదికగా ఆయన ఓ పోస్టు పెట్టారు. రైతు భరోసా, నిరుద్యోగ భృతి, కౌలు రైతులకు రూ.15 వేలు, రోజువారీ కూలీలకు రూ. 12 వేలు, కొత్తగా పెళ్లైన వధువులకు కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విస్మరించిందని ధ్వజమెత్తారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పినా ఇప్పటికీ రూ. 15,376 కోట్ల పంట రుణాల మాఫీలో 16 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. ఈ హామీల అమలు సంగతి ఏమైందో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 9 నుంచి అమలు చేస్తారా అంటూ ప్రశ్నించారు.

## నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులన్నీ కొనుగోళ్లు జరపాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా నోటిఫైడ్ చేసిన జిన్నింగ్ మిల్లులు అన్నీ పత్తి కొనుగోళ్లు జరపాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశించారు. పత్తి రైతులకు భారం కాకుండా కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమీక్షలో మాట్లాడుతూ నోటిఫైడ్ చేస్డిన ప్రతీ జిన్నింగ్ మిల్లు పనిచేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 82,44 కోట్ల రూపాయల విలువైన 11,255 టన్నుల పత్తిని 5,251 మంది రైతుల నుండి కొనుగోలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లయితే రైతులు కేవలం లూస్ కాటన్ మాత్రమే తీసుకురావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇందువల్ల రైతులకు అదనపు భారం అవుతుందన్నారు. వాట్సాప్ యాప్‌లో రైతుల నుండి వచ్చిన సమస్యలకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, మార్కెటింగ్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. అలాగే పత్తి కొనుగోళ్లలో తేమ శాతానికి సంబంధించి సడలింపు ఇవ్వాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిఎండిని కోరినట్లు చెప్పారు. రైతులందరూ తమ పత్తిని ఆరబెట్టుకుని, తేమ శాతం 8 నుండి 12 మధ్యలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కాగా రాష్ట్రంలోని రైతులందరూ 8897281111 నెంబరుతో వాట్సాప్ సేవలు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**కొత్తగూడెంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

కొత్తగూడెం జిల్లాలో సహజ, సేంద్రియ వ్యవసాయ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మంజూరు చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయమై కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు గతంలో లేఖ రాయడం జరిగిందన్నారు. దానికి ఆయన స్పందిస్తూ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ హార్టీకల్చర్ పథకంలో నిర్దేశించిన విధానాల ప్రకారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మంజూరు చేస్తామని చెప్పారని తెలిపారు.

## త్వరలో మామునూరు ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభం

### ప్రయాణికుల, కార్గో సర్వీసులు అందించేలా

### సిఎం రేవంత్‌తో చర్చిస్తా : మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త :** వరంగల్ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మామునూరు ఎయిర్‌పోర్టు కల త్వరలోనే సాకారం కానుందని రాష్ట్ర దేవాదాయ, ధరాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు అంగీకరించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి త్వరలోనే మామునూరు ఎయిర్ పోర్టు పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని వెల్లడించారు. మంగళవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డితో వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధిపై కూలంకశంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ వరంగల్ నగర పురోభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సీఎం చొరవతో వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన మామునూరు ఎయిర్‌పోర్టు త్వరలోనే అందు బాటులోకి రానున్నట్లు వెల్లడించారు. పారిశ్రామికవేత్తల రాకపోకలకు ఉపయుక్తంగా ఉండి వరంగల్ నగర పురోగతి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఊతంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం ఒక కొలిక్కి తెచ్చి చేతల ప్రభుత్వంగా నిరూపించుకుందన్నారు.

## ఖాళీ కాబోతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు

### గ్రాడ్యుయేట్లు, టీచర్ల ఓటర్ల నమోదుకు నేడే ఆఖరు గడువు

### కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఇండిపెండెంట్లు కసరత్తులు షురూ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 5:** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు దరఖాస్తు ప్రక్రియ గడువు బుధవారంతో ముగియనుంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గంతో పాటు వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజక వర్గం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. గతంలో ఓటు ఉన్న వారు కూడా ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేయాలంటే మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాల్సిందేనని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఓటర్ల ముసాయిదా జాబితా ఈనెల 23న ప్రచురించనున్నట్లు తెలిపింది. దానిపై డిసెంబరు 9 వ తేది వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాను డిసెంబరు 30న విడుదల చేయనుంది. వచ్చే ఏడాది మార్చి 29 తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీలు రఘోత్తమ్ రెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డిల పదవీకాలం ముగియనుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా పోటీ చేయడానికి పెద్ద సంఖ్యలోనే అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ చుట్టూ తిరుగుతున్నారు టికెట్ కావాలని పలుమార్లు పార్టీ పెద్దలను కలుస్తున్నారు.ఈ ఎన్నికల్లో పోటీ పడేందుకు ప్రస్తుతం ఇండిపెండెంట్లు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామాలు చేసి మరి పోటీ పడేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బిఆర్ఎస్ కసరత్తులు ప్రారంభించినట్లు సమాచారం. బిజెపి అభ్యర్థులను బరిలో దింపేందుకు సన్నద్ధమైనట్లుగా సమాచారం. ఇదిలా ఉండగా, 2019 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1,96,321 మంది ఓటర్లుగా నమోదయ్యారు. దానితో పోలిస్తే ఈసారి పట్టభద్రుల ఓట్లు భారీగా పెరిగే అవకాశముందటున్నారు అధికారులు. 2019 పట్టభద్రుల ఎన్నికల్లో 17 మంది అభ్యర్థులు పోటీ పడగా కాంగ్రెస్ తరఫున జీవన్ రెడ్డి విజయం సాధించారు. ఆయన ఎమ్మెల్సీ పదవి గడువు 2025 మార్చి 29వ తేదీతో ముగియనుంది. తెలంగాణలో కాంగ్రెస్‌తో పాటు ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, బీజేపీలు ఈ ఎన్నికలపై కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.



ఆందోళన చేస్తున్న స్థానికులు, హిందూ సంఘాల నాయకులు

# శంషాబాద్‌లో ఉద్రిక్తత

### ఎయిర్‌పోర్టు కాలనీ ఆలయంలో నవగ్రహ విగ్రహాల ధ్వంసం

### భారీ బందోబస్తు ఏర్పాటు.. స్వయంగా పర్యవేక్షించిన డిసిపి రాజేష్

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

### నేడు శంషాబాద్ బంద్‌కు విహెచ్‌పి పిలుపు

**శంషాబాద్. నవంబరు 5, ప్రభాతవార్త:** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎయిర్ పోర్ట్ కాలనీ లోని హనుమాన్ దేవాలయం ఆవరణలో ఉన్న నవగ్రహ విగ్రహాలను దుండగులు ధ్వంసం చేశారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని దుండగులు విగ్రహాలను ధ్వంసం చేశారు. విషయము ఒకసారి బయటికి వెల్లడి కావడంతో ఈ ప్రాంతంలో తీవ్ర ఉధృత నెలకొన్నది. వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో గుడి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బిజెపి. విశ్వహిందూ పరిషత్. బజరంగ్దళ్. పార్టీల నాయకులతో పాటు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కూడ అక్కడికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. విషయం తెలిసిన వెంటనే శంషాబాద్ పరిసరాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తుండడంతో అప్రమత్తమైన పోలీసులు సంఘటన జరిగిన దేవాలయం పరిసర ప్రాంతాలను దిగ్బంధం చేశారు. దేవాలయం వద్దకు ఎవరు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎయిర్ పోర్ట్ కాలనీ. కోత్వాలు గూడ నుండి రాకపోకలు సాగించే వారికి ప్రత్యామ్నాయ మార్గం ద్వారా వెళ్లాలని సూచించారు. వందల సంఖ్యలో వచ్చిన పోలీసులు దేవాలయ పరిసర ప్రాంతాలకు బయట నుండి ఎవరు రాకుండ అడ్డుకున్నారు . పెద్ద ఎత్తున గుమిగూడిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనతో ఉదిరిక్తత. దుండగులు విధ్వంసం సృష్టించిన దేవాలయం వద్ద కాలనీవాసులతోపాటు శంషాబాద్ ప్రజా ప్రతినిధులు ఆందోళనకు దిగారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్. కౌన్సిలర్లు అమృత సుధాకర్ రెడ్డి. మేకల వెంకటేష్. పుష్పలత బుచ్చిరెడ్డి. కోనమోల్ల శ్రీనివాస్ . శ్రీకాంత్ రెడ్డి. స్థానిక నాయకులు తోట రాములు. సురేష్‌గౌడ్. కొత్త కాపు రాజిరెడ్డి శ్యాంసుందర్ తదితరులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొన్నది.

చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్. బుక్క వేణుగోపాల్. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్. చింతల నందకిషోర్,ముదిరాజ్ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్. శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్. పి సి సి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నరేందర్ తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు .అనంతరం విశ్వహిందూ పరిషత్ నాయకులు హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు నేడు బందుకు పిలుపు. ఎయిర్పోర్ట్ కాలనీలో జరిగిన విద్వాన్ సంఘటనకు వ్యతిరేకంగా బుధవారం శంషాబాద్ బంద్ నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రకటించారు. వ్యాపారస్తులు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్కు సహకరించాలని కోరారు.

## బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పనుల్లో అపశ్రుతి

### గిర్డర్ కిందపడి కార్మికుడి మృతి, ఇద్దరికి గాయాలు

**గాంధీనగర్, నవంబరు 5:** ముంబై, అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు మార్గంలో ట్రాక్ నిర్మాణ పనుల్లో అపశృతి చోటు చేసుకుంది. వల్సాడ్ వద్ద ట్రాక్ నిర్మాణం వద్ద గిర్డర్ కుప్పకూలడంతో ఒక కార్మికుడు అక్కడికక్కడే మరణించాడు. మరో ఇద్దరు కార్మికులు క్షతగాత్రులయ్యారు. ఆనంద్ జిల్లా పరిధిలో జరిగిన ఈ ప్రమాద సంగతి తెలియగానే జిల్లా అధికారులు, పోలీసులు, అగ్నిమాపక దళ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయ పనులు చేపట్టారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టు సైట్ వద్ద నిర్మిస్తున్న గిర్డర్ కూలింది. దాని కింద నలుగురు కార్మికులు చిక్కుకున్నారు. వారిలో ఇద్దరిని బయటకు తీసి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాం అని ఆనంద్ జిల్లా ఎస్పీ గౌరవ్ జసానీ చెప్పారు. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ కూడా ఈ ఘటనను ధృవీకరించింది. మహీ నదిపై వంతెన నిర్మాణంలో భాగంగా ఏర్పాటుచేసిన గిర్డర్ కూలిపోయవడంతో కాంక్రీట్ బ్యాకుల మధ్య కార్మికులు చిక్కుకున్నారు అని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ పేర్కొంది.

